# అచలపతీ - క్రి 'కేటూ'

**"**అచలపతీ! ఇవాళ ఇన్‌కమ్‌టాక్సు ఆఫీసుకెళ్లాలని ఆడిటరు గారన్నారు.. "

"...ఫోన్ చేశా సర్! ఆయనివాళ ఆఫీసు రాలేదట" అంది ముద్ద కట్టిన ముందుచూపు.

"వెరీగుడ్! అంటే నేను చెప్పకముందే నువ్వు ఫోన్ చేసినందుకు గుడ్డన్నమాట. ఆడిటర్‌గారు ఆఫీసుకు రానందుకు కాదు. ఆయన లేరంటే ఇన్‌కంటాక్సు ఆఫీసుకు మనమే స్వయంగా వెళ్లాలంటావా? అసలీ ఇన్‌కంటాక్స్ కనిపెట్టిందెవరయ్యా? నాకు పని కల్పించడానికి ఎవరో పన్నిన పన్నాగం కాకపోతే... వాటీజ్‌ది 'అవుట్‌కమ్' ఆఫ్ ఇంపోజింగ్ దిస్ 'ఇన్‌కమ్' టాక్స్ ? చూసావా, అదేదో బాగా పండింది కదూ. ఇన్‌కమ్ – అవుట్‌కమ్...వాఁ వాఁ"

"సర్, మీకు ప్రస్తుతానికి కావాల్సిన సమాచారంపై మాత్రమే ఏకాగ్రత నిలుపుకోవాలంటే.."

"అవునూ, ఏకాగ్రతకు ఆపోజిట్ ఏమిటోయ్? అనేకాగ్రతా? సందేహం వచ్చినప్పుడే తీర్చేసుకోవడం మంచిది. పైగా అడిగేవాడికి చెప్పేవాడు అస్తమానూ లోకువ కాకపోవచ్చు. అంచాత ఇప్పుడే.."

"సర్, మీకు ప్రస్తుతానికి కావాల్సిన సమాచారంపై మాత్రమే ఏకాగ్రత నిలుపుకోవాలంటే.."

"చూడు అచలపతీ, ఒకేరకమైన వాక్యాలు రెండుసార్లు ఉపయోగించావంటే అచ్చుతప్పు పడిందేమోనని పాఠకుడు కంగారు పడి, లేవలేడు".

"సర్, మీకు ప్రస్తుతానికి.."

"... బాబోయ్, విషయానికి వచ్చేయ్, సంభాషణను పక్కదారులు పట్టించనని హామీపత్రం ఇస్తా".

"ఇన్‌కమ్‌టాక్సు ఆఫీసుగారు కూడా లీవే సర్".

"ఏం?"

"ఆయన స్టాఫ్‌లో చాలా మంది లీవు పెట్టారు కదా, ఆఫీసుకొచ్చినా పని నడవదని ఆయనా ఆఫీసుకు లీవేసారట సర్".

" ఈ ఏడు చేపల కథ ఎప్పటికీ పాతబడని కథలా ఉంది. ఇంతమంది లీవేయడానికి గల కారణం ఏమిటిట?"

"ఇవేళ వల్‌డు కప్ క్రికెట్ టూర్నమెంటు ఫైనల్ అని మీకు.."

"చూడు అచలపతీ! నేను నా 'స్మృతులూ – జ్ఞాపకాలు' రాస్తున్నది తెలుగులో, మరియు తెలుగు పాఠకుడి కోసం. నువ్వు 'వల్'డు అని కరెక్టుగా పలికితే అతగాడికి అర్థం కాదు. ఇంచక్కా 'వరల్డు' అను, నేనూ అలాగే రాస్తాను".

"ఇంగ్లీషుని, ఇంగ్లీషులా ఉచ్చరించాలనే ఆతృతలో..."

"ఇంగ్లీషు వాడికే ఆ బాధ లేనప్పుడు నీకెందుకయ్యా. ఎవరి మీదైనా కోపం వచ్చినప్పుడు 'వాడొట్టి వరష్టు ఫెలోనండీ' అనకపోతే తెలుగువాడి గుండెమంట చల్లారుతుందా? 'వరష్టు ఏమిటయ్యా అరిష్టంలా? ఇంగ్లీషు భాషను తేలిగ్గా, బులబులాగ్గా పలకాల'ని చెప్పిచూడు – టైము వే'ష్టు' చేయకుండా నీ పని చూసుకో' అని అంటాడు."

"దీనికి కారణం – తెలుగువాళ్లకు వర్ణక్రమం మీదున్న మక్కువనీ, రాసినది రాసినట్టే పలకాలన్న తాపత్రయమనీ నాకు తోస్తుంది సర్".

"కరక్ట్! అంచేత, 'దేర్ ఆర్ యాజ్ మెనీ పెరల్స్ యాజ్ గరల్స్ ఇంది వరల్డు' అని అనాలంటే అలాగే అను. గాళ్స్. పేల్స్ అనకు".

"మీ ఆదేశం సర్వదా శిరోధార్యం సర్".

"దట్స్ ఫైన్. అయితే మన ఎజెండాలో మొదటి అంశం ఇన్‌కంటాక్స్ ఆఫీసు కెళ్లడం తప్పిపోయింది కాబట్టి ఈ 'క్రికెట్ మ్యాచ్ నాడు ఆఫీసుకు సెలవు పెట్టుట' అన్న విషయం గురించి చర్చిద్దాం. ఈ విషయంలో నీ అభిప్రాయం ఏమిటి?".

"నా సవినయ అభిప్రాయ ప్రకారం – అంటే ఇన్ మై హంబుల్ ఒపీనియన్ అన్నమాట – క్రికెట్ ఆటకున్న గ్లామరే దానికి చెఱుపు చేస్తోంది సర్".

"ఏంటీనా సరిగ్గా లేనట్టుంది. సిగ్నల్ అందుకోవటంలేదు. సెలవు పెట్టడానికీ, గ్లామర్ కీ సంబంధం ఏమిటో క్లుప్తముగా విశదీకరించుము".

"క్లుప్తముగా, విశదీకరణ – రెండూ పరస్పర విరుద్ధ పదాలన్న విషయం పక్కన

బెడితే – రేడియో, టీవీల పుణ్యమాని క్రికెట్ ఆటను విని, చూసి తామేదో క్రీడాభిమానులనుకోవడం జనాలకి పరిపాటి అయింది. ఆరోగ్యం కోసం క్రీడలు ఆడాలి కానీ చర్చిస్తే సరిపోదు. ఆఫీసు పని ఎగ్గొట్టి క్రికెట్ కామెంటరీ విననివాడు 'అన్‌స్పోర్టివ్' అనేటంత వరకూ పోయింది పరిస్థితి. క్రికెట్ తప్ప తక్కినదేదీ ఆట కాదనేటంత వరకూ పోయింది సమాజం. క్రికెట్‌కూ, అడ్వర్టయిజ్‌మెంట్లకూ ఉన్న లింకే ఈ పరిస్థితికి కారణం అని నా సవినయాభిప్రాయం సర్".

"నేను నీతో విభేదించడానికి అర్థిస్తున్నాను. అంటే ఐ బెగ్ టు డిఫర్విత్యూ. అడ్వర్‌టైజ్‌మెంట్లు వస్తున్నాయి కాబట్టే, టీవీ వాళ్లు చూపిస్తున్నారు, ఆటగాళ్లు ధనవంతులవుతున్నారు, ప్రతీ పిల్లవాడికీ ఆట మీద ఆసక్తి పెరుగుతోంది. 'గల్లీ, గల్లీ మే గవాస్కర్' పథకం అమలు జరపబడి తాడిత, పీడిత, దళిత జాతుల నుండి కూడా ఆటగాళ్లు ఉద్భవించి షార్టుకట్లో సంపన్నులవుతున్నారు. సవర్ణుల ఇళ్లల్లో పూజామందిరా లంకరిస్తున్నారు. ఈ సాంఘిక విప్లవానికి కారణం ఏమిటి? క్రికెట్! అందువల్ల ఎప్పుడూ వినండి, చూడండి – క్రికెట్! ...టింగ్ టింగ్".

ప్రతీ కథకీ ఓ భూమిక ఏర్పడిపోతుంది, మనకు తెలీకుండానే. పురాణాలే చూడండి. ఓ ఇద్దరు ఉత్తిపుణ్యానికి కొట్టుకు ఛస్తారు. ఎందుకర్రా, అంటే క్రితం జన్మలో వాళ్ళు తపస్సు చేసి, వరం అడిగి .. ఇలా ఏదో ఓ కథ చెప్తారు. అలాగ క్రికెట్ గురించి ఆ రోజు ఉదయం నాకూ, అచలపతికి మధ్య జరిగిన పై సంభాషణ తర్వాతి తరాల వారికి అందకుండా పోయి ఉండేది – రాయుడి కథకు అది భూమికగా ఉపయోగపడి ఉండకపోతే.

ఆ మధ్యాహ్నం రాయుడు రావడం, తన ఆర్థిక సమస్యలు ఏకరువుపెట్టి నా సాయం కోరడం వల్ల నేను ఆలోచించరావలసి రావడం, ముందే సిద్ధమైపోయి ఉన్న క్రికెట్ భూమికను వాడుకోవడం జరిగేయి.

రాయుడు పిల్ల జమీందారుగానే కొనసాగి ఉండేవాడు – బ్రాకెట్టు పిచ్చిపట్టి ఉండకపోతే, అర్థరాత్రయినా అంకెల కోసం రోడ్లు పట్టుకు తిరగడాలూ, పేపర్లో కార్టూన్ల చేతి కదలికలకు అర్థాలు లాగి వాటిని అంకెల్లో తర్జుమా చేయడాలూ, ఫోన్ దగ్గరే పడిగాపులు కాయడాలూ – వీటివల్ల వాడి బుర్రా బుద్ధీ, ఆస్తీ పాస్తీ – అన్నీ ఊడ్చి పెట్టుకుపోయాయి.

ముష్టెత్తుకొనేందుకు మంచి స్లోగన్ ఒకటి రాగయుక్తంగా ప్రాక్టీసు చేస్తున్న టైములో

ఓ దూరపుబంధువు బాల్చీ వీడి వైపు తన్నేశాడు. బాల్చీలో చూస్తే బోల్డు డబ్బులున్నాయి! దాన్ని బోల్డున్నర చేయడం ఎలా అని అడగడానికి వచ్చాడు నా దగ్గరికి.

పొద్దుటి సంభాషణ త్రేన్చి "క్రికెట్ మాచ్ స్పాన్సర్ చేయరాదా?" అన్నాను.

వాడు కాస్సేపు ఆలోచించి 'ఒన్స్ ఎ గేంబ్లర్ ఆల్వేజ్ ఎ గేంబ్లర్' అన్న స్టయిల్లో నవ్వి "అంతకంటే దివ్యమైన అయిడియా చెప్పనా?" అన్నాడు.

క్రికెట్‌సీమ నేలేవాళ్లల్లో కోటేశ్వర్రావు అనే కోటికి పడగ ఎత్తి అలాగే ఉంచుకున్న ఆటగాడున్నాడుట. 'బెట్టింగ్ సర్కిల్స్' లో అతన్ని కేటేశ్వర్రావు అని కూడా అంటారుట. అంటే అతను ఇన్ని పరుగులు తీస్తాడని పందాలు కాసే వాళ్లతో చేతులు కలిపి ఆ ప్రకారం ఆడతాడుట. ఎన్ని కావాలంటే అన్ని రన్స్ కొట్టగల సామర్థ్యం గలవాడు కాబట్టి బెట్టింగ్ చేసినవాళ్లు ఫైనల్‌గా లెక్కవేసి ఎన్ని కొట్టాలో చెప్తే అన్నే కొడతాడుట. అంటే అతను సెంచరీ కొడతాడని జనాలంతా పందేలు కాసారనుకోండి. సరిగా సెంచరీయే కొడితే బుకింగు చేసుకున్న వాడు నెత్తిన గుడ్డేసు కోవాల్సిందే. అందుచేత తొంభైతొమ్మిదో, నూటొకటో కొట్టమని కోటేశ్వర్రావుకి కబురు పెడతారు. మ్యాచ్ అయిపోయిన సాయంత్రం ఒప్పందం ప్రకారం అతనికి డబ్బు ఇచ్చేస్తారట.

ఇదంతా చెప్పి "కోటేశ్వర్రావుతో ఒప్పందం కుదుర్చుకుంటే ?" అన్నాడు.

"...కుదుర్చుకో"

"నువ్వూ, అచలపతీ కూడా రావాలి".

"దీనిలో నా పాత్రకు చోటెక్కడ?"

"పెద్దమనిషిగా! - డబ్బున్నవాడు మధ్యలో లేకుండా పెద్దమనిషి ఒప్పందం కుదుర్చుకోవడం ఎలా?"

కోటేశ్వర్రావు తనింట్లో రకకకాల భంగిమలు ప్రాక్టీసు చేస్తూ కనబడ్డాడు. 'ఫీల్డింగ్‌కా, డాన్సింగ్‌కా' అని ఆశ్చర్యపడుతూంటే వీడియో కెమెరాలతో రకరకాల కంపెనీ వాళ్లు మూలమూలల్లో కనబడ్డారు.

ఓ కంపెనీ స్పాన్సర్ చేయడం-ఓ టీవీ ఛానల్ దాన్ని ప్రసారం చేయడం -వాళ్ల కెమెరాకు స్టేడియంలో దొరికిన మూల నుండి ఫోకస్ చేయగల శరీర భాగాన్ని కోటేశ్వర్రావు వారికి కేటాయించడం - ఇలాటివాటి వల్ల కోటేశ్వర్రావు ఒళ్లంతా కోపరేటివు పద్ధతిలో అమ్ముడు పోయింది. కుడి జబ్బ మీదున్న బేనర్ తాలుకు కంపెనీకి,

హిప్‌పాకెట్‌లో పెట్టుకున్న ఆయింట్‌మెంట్ తాలూకు కంపెనీకు మధ్య గొడవ జరుగుతోంది. కోటేశ్వర్రావుని ఇంకా వంగమని ఒకళ్లు, అంత వంగవద్దని మరోళ్లు గోల! –ఎవరి 'వ్యూ' పాయింట్ వాళ్లది . "ఇలా నుంచున్నప్పుడు బాల్ వస్తే పట్టుకోబోయి బోర్లా పడతాను" అంటున్నాడు కోటేశ్వర్రావు "అప్పుడు మా కంపెనీకి పబ్లిసిటీ పెరుగుతుంది సార్". అంటూ ఆనందించేడు పిక్క మీద స్టిక్కర్ కంపెనీ వాడు.

"మెడా, పక్కటెముకలూ మాత్రం మిగిలాయి. కావాలంటే చెప్పం"డన్నాడు. కోటేశ్వర్రావు సెక్రెట్రీ మాతో.

"మేం వచ్చింది మరోదానికి" అన్నాడు రాయుడు.

'కోటేశ్వర్రావు, ది ఆటగాడు' ఎంత గొప్పవాడైనా! 'కోటేశ్వర్రావు, ది వ్యాపారస్తుడు' ముందు తల ఒగ్గాల్సిందే, "ఏభయి రన్స్ దాకా రన్నుకొక ఎకరా చొప్పున గవర్నమెంటు వాళ్లే ఇస్తానన్నారు కదా. ఓ ఫార్మ్ హవుస్ కొందామనుకొంటున్నాను. పైన ఇరవై రన్స్ కొడితే గానీ మా ఆవిడకి మింక్ కోటు రాదు. పిల్లలిద్దరూ స్విట్జర్లాండ్‌కి వెకేషన్ అంటున్నారు. చెరో అయిదూ, మొత్తం 80 దాకా కొట్టాలి. 82 దగ్గిర సెటిలు చేసుకుందాం. మీరు దాని కటూ, ఇటూగా బెట్స్ ఏక్సప్ట్ చేసుకోండి. ఆటయిపోయిన సాయంత్రం నా డబ్బు నాకిచ్చేయండి. అనంత్‌గారు గ్యారంటీ అన్నారు కాబట్టి అడ్వాన్సేమీ అడగటం లేదు". అన్నాడాయన.

అప్పుచేసినవాడు పప్పుకూడు తినగా మీరు చూసి ఉండవచ్చుగానీ గ్యారంటీ ఇచ్చినవాడు ఉప్పుకూడు కూడా తినడు. ఉదాహరణకి మనలాటివాడి దగ్గరకి మనవాడొకడు వచ్చి 'ఫలానా బ్యాంకులో అప్పుతీసుకుంటా. గ్యేరంటారుగా చిన్న సంతకం పెట్టరా' అంటాడు. చిన్నదే కదాని పెట్టేస్తాం. ఆ తర్వాత వాడు వాడి వ్యాపారమో, వ్యవహారమో బ్యాంకువారి అజమాయిషీలో వెలగబెడుతున్నాడు కాబోసు అనుకుంటాం.

ఓ నాట్–సో–ఫైన్ మార్నింగు నాడు బ్యాంకు వాళ్లు పిలిచి 'మీ వాడి ఫ్యాక్టరీ పడుక్కొని చాన్నాళ్లయింది. ఆ డబ్బు– వడ్డీతో సహా – కట్టెయ్యి అని మన్ని అడుగుతారు. 'వాడి సంగతో' అంటే 'వాణ్నీ అడిగాం, నిన్నూ అడిగేం. వాడికిలేదు కాబట్టి వాణ్ని వెనకబెట్టి, నీకుంది కాబట్టి నీ వెంటబడ్డాం' అంటారు.

'ఈ ముక్కముందే చెబితే కాస్త ముందుగా అప్పు కట్టేసి వడ్డీ మిగుల్చుకుందును కదా! పోనీ ఇప్పుడు కట్టేశాననుకోండి. ఆ డబ్బు నాకు తిరిగెలా వస్తుంది?' అంటే 'వాణ్ణి అడిగి తీసుకో. మా కివ్వాల్సింది నీ కిచ్చేయమని చెప్తాం లే' అంటారు. 'ఇంత

మందీ మార్బలం ఉండి, వాడు మునుగుతూంటే చూస్తూ ఊరుకొని, తర్వాత వసూలు కూడా చేయలేక పోయారే! నేనొక్కణ్ణి ఎలా వసూలు చేసుకోగలనండీ' అని మనం అరిచి గీపెట్టినా వినరు. మనకు శంఖం ఊదడం రాదు కాబట్టి వాళ్ల ముందు ఊది, వాళ్లు చెవిటి వాళ్లా కాదా అని తెలుసుకొనే అవకాశం లేదు.

ఈ ఆలోచనలన్నీ నాకు గ్యారంటీ ఇచ్చేటప్పుడు రాలేదు కానీ తరవాత వచ్చాయి – ఆట ముందు రోజు, రాయుడొచ్చి హొరైజన్‌కి దారి అడిగిన రాత్రిన.

ఆవేళ మధ్యాహ్నం దాకా ఎడాపెడా, చెడామడా పందాలు కట్టించేసుకుని రాయుడు వచ్చి అడిగేడు 'హొరైజన్ ఎటువైపురా?' అని.

రాయుడు హొరైజన్ వైపు మహాభినిష్క్రమణం గావిస్తాట్ట. కోటేశ్వర్రావు సంగతి జనాలందరికీ తెలిసిపోయినట్టుంది. ఒకటినుంచి వరసగా అన్ని అంకెల మీదా వెర్రిగా పందాలు కట్టేసారుట – మా వాడు చూపిన ప్రలోభాలకు ఆశపడి! అతను ఎన్ని రన్స్ కొట్టినా సరే రాయుడి పని దివాళాయేట. పోగేసిన డబ్బు ఇవ్వవలసిన దానికంటె తక్కువ పడుతుందిట.

'ఎన్ని రెట్లివ్వగలవో ముందే సరిగ్గా లెక్క వేసుకోలేదా?' అని చివాట్లేశాను.

'నువ్విలా తిడతావని తెలుసు. అందుకే నీ కంటబడకుండా ఓ ఉత్తరం రాసి నిష్క్రమణం గావిద్దామనుకొన్నాను. కానీ ఇల్లంతా సుఖ్‌రామ్ ఇల్లులా ఉంది. ఎక్కడ చూసిన నోట్లే. ఉత్తరం రాద్దామంటే కాగితం ముక్క దొరకలేదు. నేనే కదిలివచ్చాను. ఎల్లుండి మా ఇంటికెళ్లి ఆ డబ్బంతా పంచిపెట్టేయి' అన్నాడు.

"సరే, ఇక కదులు" అన్నాను విసుగొచ్చి.

"ఇంకా సూర్యాస్తమయానికి టైముందిగా. సన్‌సెట్ బాక్‌డ్రాప్ లేకుండా ట్రాజిక్‌హీరో నిష్క్రమణం ఎప్పుడైనా చూసావా?" అని చివాట్లేసేడు.

అచలపతి దగ్గాడు. అతనెటువంటి సందర్భాల్లో దగ్గుతాడో మీరీపాటికి గ్రహించే ఉంటారు.

"ఒక చిన్న సలహా ఇవ్వచ్చా సర్?" అన్నాడు వినయంగా.

"హొరైజన్‌కు నడిచే వెళ్తాను. కార్లో వెళ్లమని సలహా యిచ్చినా వినను." అని ఉద్ఘాటించాడు రాయుడు.

"దాని గురించి కాదు సర్. 'మీ మహాభినిష్క్రమణం వీడియో తీయించి హొరైజన్‌కి అవతల మీకందజేసే ఏర్పాట్లు చూడమంటారా సర్?' అని అడుగుదామని.."

"బ్రహ్మాండమైన ఐడియా.."

"అయితే అలా వెళ్లిపోయేటప్పుడు మీతో బాటు విశ్వాసపాత్రంగా ఉండే ఒక పావురమో, ఒక కుక్కో కూడా వెంట వచ్చేట్లు ఏర్పాటు చేస్తే.."

"ఇంకా అద్భుతంగా ఉంటుంది. ఓ గంట ఆలస్యమైనా అవన్నీ కుదిరేకనే మహాభినిష్క్రమణం.." ఉద్ఘోషించేడు రాయుడు.

"ఇంకొక్క విషయం సర్, మీరు అలా సిల్‌హౌట్‌లో ఉండగా మీ వీపు మీద 'ది ఎండ్', 'పాజిబ్లీ నాట్ ది ఎండ్', 'ఫార్చ్యునేట్లీ ది ఎండ్' – ఈ మూడిట్లో ఏది పెట్టమంటే అదే పెట్టిస్తాం సర్. కానీ చిన్న విషయం. ఇవన్నీ ఏర్పాటు చేయడానికి కాస్త టైము పడుతుంది. ఇవాళ మబ్బుగా కూడా ఉంది. మీ ప్రోగ్రాం రేపటికి వాయిదా వేసుకొంటే..."

"అలాగే కానీ, నేను వీడింట్లో ఉన్నట్టు వాళ్లెవరికీ తెలియదుగా".

రాత్రి పడుకోబోతూండగా పై పేరాలో విషయం నాకు గుర్తొచ్చింది. అచలపతిని పిలిచి అడిగా – "రాయుడికి ఏది ఏర్పాటు చేస్తున్నావ్? కుక్కా? పావురమా?"

"దొరికిన దాన్ని బట్టి.."

"రెండూ దొరికించుకో. ఒకటి నాకూ, మరోటి వాడికీ. ఇంకోమాట – హొరైజన్‌కు ఒక్కటే దారుందా? రాయుడు వెళ్లే దారిలో వెళ్లే ఉద్దేశ్యం లేదు నాకు..".

"మీరూ మహాభి.."

"అదే.. అదే.. చెప్పబోతున్నా.. నాకు సడన్‌గా గుర్తొచ్చింది... కోటేశ్వర్రావుకి గ్యారంటీ ఇచ్చినది నేను. రాయుడి డబ్బు పందాలు కట్టిన వాళ్లకి పోగా, నా డబ్బు కేటేశ్వర్రావుకి పోతుంది".

"అయితే మీరు అంతిమంగా లోకాని కిచ్చే సందేశం రాసివ్వమంటారా సర్?"

"అంతకంటె ఉపాయం చెప్పి ఈ చిక్కులోంచి బయటపడేయడం సులభమేమో..".

"..పడేసినా రాయుడిగారికి మళ్లీ ఆశ పుడితే...?"

"...పుడితే వాణ్నే పెంచుకోమను. నేనిక ఆ జోలికి వెళ్లను".

"అయితే కోటేశ్వర్రావుగారింటికి మీ తరఫున నన్ను పంపిస్తున్నారు కదా, సర్?"

రాయుడి కేకతో పొద్దున్న మెలకువ వచ్చింది.

"ఒరే, కేటేశ్వర్రావుగాడు 'డక్' కొట్టాడ్రా. మనం ఎవ్వడికీ చిల్లి పైసా ఇవ్వక్కర్లేదు.

డబ్బంతా మనదే" అంటూ అరుస్తున్నాడు.

'కలా?' అన్నట్టు అచలపతి కేసి చూశా!

'..కాదు సుమండీ' అన్నట్టు మొహం పెట్టాడతను.

"82 కొడతానన్నవాడు సున్నా కొడితే ఎలా? అతని భార్య బిడ్డల గతి ఏం గాను?" అని వాపోబోయేను.

"ఆ వర్రీతోనే మొదటి ఓవర్లోనో అవుటు అయిపోయాడండి" అన్నాడు అచలపతి.

"వర్రీ ఎందుకయ్యా?"

"మరి మనతో ఒప్పందం చెడిపోయిందిగా.. మన వైపు నుంచి రావాల్సిన డబ్బు రాకుండా పోయింది. ఇంకొకర్తో కుదుర్చుకుందామన్నా వ్యవధి లేదు. మన దగ్గర్నుంచి రావాల్సిన డబ్బుతో కొందామనుకొన్న వస్తువులు కళ్ల ముందు ఆడుతూంటే బాధతో ఆయన ఆడలేక ఓడిపోయాడనుకొంటాను సర్".

"కానీ ఒప్పందం రద్దయిందని ఎవరన్నారు?"

"నేను సర్. మీ తరఫున నిన్న రాత్రే చెప్పా. మీతో ఇలాంటి బేరం లేదు. ఇష్టమొచ్చినన్ని రన్స్ కొట్టుకోండి. మేము ఏమీ ఇవ్వం' అని, ఆ నష్టానికి తట్టుకోలేక తబ్బిబ్బు పడ్డాడు".

"...పడి మనను బతికించాడు".

"..ముఖ్యంగా నన్ను" అన్నాడు రాయుడు.

"అచలపతీ నీకింత తెలివితేటలు ఎలా వస్తాయోయ్? నువ్వేం తింటావ్?" అన్నాడు రాయుడి గొడవ చల్లారేక.

"మీకు పెట్టేదే సర్" అంది గుంభనం.

నేన్నమ్మను! మనకు తెలీకుండా రామర్ పిళ్లె మూలికలు లాటివేవో నవులుతూండవచ్చు. వాకబు చేయాలి.

